కొందుర్గు మండలం అయోధ్యాపూర్‌తండా మాజీ సర్పంచ్ గోపాల్‌నాయక్ కుమారుడు మురళి మృతిచెందిన విషయాన్ని తెలుసుకున్న షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ సోమవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యం కల్పించారు. - కొందుర్గు, మార్చి 3

ఇబ్రహీంపట్నం మార్కెట్ యార్డులో ఎరువుల దుకాణాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్ గురునాథ్‌రెడ్డి

రైతులకు అందుబాటులో ఎరువులు, విత్తనాలు

మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం, మార్చి 3 : రైతులకు అందుబాటులో ఉంచడం కోసమే ఎరువుల కొనుగోలు కేంద్రాన్ని ఇబ్రహీంపట్నం మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసినట్లు మార్కెట్ కమిటీ చైర్మన్ కంబాలపల్లి గురునాథ్‌రెడ్డి అన్నారు. ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం యూరియాతోపాటు ఎరువుల దుకాణాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శేరిగూడలోని ఉప్పరిగూడ సహకార సంఘం ఆధ్వర్యంలో శేరిగూడలో కొనసాగుతున్న ఎరువుల కొనుగోలు కేంద్రాన్ని అందరికీ అందుబాటులో ఉంచడం కోసం ఇబ్రహీంపట్నంలో ఏర్పాటు చేసినందున రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ కరుణాకర్, సహకార సంఘం చైర్మన్ పాండురంగారెడ్డి, వ్యవసాయశాఖ ఏడీఏ సుజాత, వ్యవసాయాధికారి విద్యాధరి, ఏఈవో శ్రవణ్‌కుమార్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు ఉన్నారు.

ఎల్ ఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకోండి

మాట్లాడుతున్న కమిషనర్ రవీందర్‌రెడ్డి

పెద్దఅంబర్‌పేట, మార్చి 3 : ఎల్ఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకుని 25 శాతం రాయితీ పొందాలని మున్సిపల్ కమిషనర్ రవీందర్‌రెడ్డి అన్నారు. సోమవారం తట్టిఅన్నారంలోని మున్సిపల్ మున్సిపల్ వార్డు కార్యాలయంలో ఎల్ఆర్ఎస్‌పై సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 2020లో రూ. 1000 చెల్లించి ఎల్ఆర్ఎస్ కోసం రిజిస్టర్ చేసుకున్న ప్లాట్ల యజమానులు ఈ నెల 31 వరకు ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించి సర్కారు కల్పించిన 25 శాతం రాయితీ పొందాలని కోరారు. ఎల్ఆర్ఎస్‌పై సందేహాల నివృత్తి కోసం పెద్దఅంబర్‌పేటలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామని, ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సంప్రదించవచ్చని చెప్పారు.



ఆర్డర్ కాపీలను పీఏసీఎస్ చైర్మన్, డైరెక్టర్లకు అందజేస్తున్న సీఈవో వెంకటయ్య

రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

నందిగామ, మార్చి 3 : పీఏసీఎస్ చైర్మన్‌లు, డైరెక్టర్ల పదవీకాలం ఫిబ్రవరి 14కు ముగియడంతో మరో ఆరు నెలలకు పదవీకాలం పొడిగిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో పీఏసీఎస్ చైర్మన్‌లు, డైరెక్టర్లకు రంగారెడ్డి డీసీవో ఇచ్చిన ఆర్డర్ కాపీలను సోమవారం చేగూరు పీఏసీఎస్ చైర్మన్, డైరెక్టర్లకు సీఈవో వెంకటయ్య అందజేశారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ చైర్మన్ అశోక్ మాట్లాడుతూ.. రైతులకు ఇబ్బందులు రాకుండా రైతులకు కావాల్సిన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచడంతోపాటు రుణాలు కూడా అందించనున్నట్లు తెలిపారు. రైతుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ పద్మారావు పాల్గొన్నారు.



శంకర్‌పల్లి మండలం కొండకల్, వెలిమెల తండా శివారులోని లంబాడా గిరిజన ప్రజలు తమ 80 ఎకరాల బిలాదాఖల భూముల ఆక్రమణలపై చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 52వ రోజుకు చేరాయి. దీక్షలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు రాజు పాల్గొన్నారు.
- చేవెళ్ల రూరల్, మార్చి 3



మండల పరిధిలోని బీరప్ప ఆలయానికి బీఆర్ఎస్ నాయకులు కడల శ్రీశైలం రూ.51 వేలు, ఎమ్మె నారాయణ రూ.51 వేల విరాళాన్ని అందజేశారు. - కొత్తూరు, మార్చి 3

నందిగామలో హైదరాబాద్‌లోని వాసన్ కంటి అసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన కంటి వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న మాజీ జడ్పీ వైస్ చైర్మన్ గణేశ్ - నందిగామ, మార్చి 3

మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త మంకి శేఖర్ మాతృమూర్తి మైసమ్మ ఇటీవల మృతిచెందగా.. సోమవారం రాష్ట్ర ఫుడ్ కమిషన్ వైర్మన్ గోలీ శ్రీనివాస్‌రెడ్డి సమకూర్చిన రూ.10 వేలను బాధిత కుటుంబానికి జీఎస్ఆర్ యువసేన నాయకులు అందజేశారు.
- కడ్తాల్, మార్చి 3

అసంపూర్తి పనులు పూర్తిచేస్తాం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొత్తూరు మున్సిపాలిటీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొత్తూరు, మార్చి 3 : మున్సిపాలిటీలో అసంపూర్తిగా ఉన్న అభివృద్ధి పనులను త్వరలో పూర్తిచేస్తామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. కొత్తూరు మున్సిపాలిటీలో 2, 3, 8, 9, 10, 11 వార్డుల్లో సోమవారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పర్యటించారు. వార్డుల్లో జరుగుతున్న అభివృద్ధి, అసంపూర్తి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,, అసంపూర్తిగా ఉన్న సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులను, స్టేషన్ తిమ్మాపూర్ అంగన్‌వాడీకి మరమ్మతులు త్వరలోనే పూర్తిచేస్తామని చెప్పారు. ఎండాకాలం వచ్చినందున మిషన్ భగీరథ నీటి సరఫరాలో ఇబ్బందులు రాకుండడా చూడాలని అధికారులను ఆదేశించారు. క్రీడలకు ఆడేందుకు తీవ్ర ఇబ్బందులు ఉన్నాయని నాయకులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. త్వరలో మున్సిపాలిటీలో క్రీడా మైదానం ఏర్పాటుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో కొత్తూరు మున్సిపల్ కమిషనర్ బాలాజీ, ఏఈ నరేశ్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

షాద్‌నగర్‌రూరల్ : ఫరూఖ్‌నగర్ మండలంలోని లింగారెడ్డి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. సీసీ రోడ్డు పనులకు సి.ఆర్.ఆర్ ఎస్సీ సబ్‌ప్లాన్ నుంచి రూ.10 లక్షలు, డి.ఎం.ఎఫ్.టి నిధుల నుంచి రూ.8 లక్షలు మొత్తం రూ.18 లక్షలు వెచ్చిస్తున్నట్లు ఆయన తెలిపారు.



శంకర్‌పల్లి గ్రంథాలయాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే యాదయ్య, చైర్మన్ మధుసూదన్‌రెడ్డి

గ్రంథాలయాల అభివృద్ధికి కృషి

చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల రూరల్, మార్చి 3 : గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. శంకర్‌పల్లిలోని గ్రంథాలయాన్ని సోమవారం ఎమ్మెల్యే గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రంథాలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి పాఠకులకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. ఎమ్మెల్యే వెంట స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులున్నారు.

రేపటి నుంచి ఇంటర్ పరీక్షలు

- షాద్‌నగర్‌లో 6 పరీక్షా కేంద్రాల ఏర్పాటు
- మొదటి రోజు పరీక్ష రాయనున్న 2622 మంది విద్యార్థులు
- నిమిషం ఆలస్యమైనా పరీక్షకు నిరాకరణ

షాద్‌నగర్‌టౌన్, మార్చి 3 : ఇంటర్ వార్షిక పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులకు అవసరమయ్యే మౌలిక వసతులను సంబంధిత అధికారులు ఏర్పాటు చేశారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే ఈ పరీక్షలకు ఒక నిమిషం ఆలస్యంగా వచ్చిన పరీక్షకు అనుమతించరనే విషయాన్ని విద్యార్థులు గ్రహించాలన్నారు. పరీక్ష సమయానికి గంట ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సంబంధిత శాఖ అధికారులు సూచిస్తున్నారు. షాద్‌నగర్ పట్టణంలో 6 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో సుమారు 2050 మంది మొదటి సంవత్సరం విద్యార్థులు, ఒకేషనల్ 572 మంది విద్యార్థులు మొదటి రోజు పరీక్షకు హాజరవుతున్నట్లు కస్టోడియన్ శ్రీకాంత్ తెలిపారు. విద్యార్థులు ఎలాంటి ఆందోళన చెందకుండా సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకుని ప్రశాంతంగా పరీక్షలు రాయాలని సూచించారు. కేంద్రాల్లో అన్ని మౌలిక వసతులను కల్పించామన్నారు. విద్యార్థులు, సంబంధితశాఖ ఉద్యోగులకు మినహా ఇతరులకు పరీక్షా కేంద్రాల్లోకి అనుమతులుండవన్నారు. విద్యార్థులు హాల్‌టికెట్ లేకుండా హాజరు కావడానికి అనుమతి లేదని, సెల్‌ఫోన్లు, క్యాలిక్యులేటర్లు, ఇతర పేపర్లు, ఎలక్ట్రానిక్ పరికరాలను తీసుకెళ్లేందుకు వీలులేదన్నారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద మంచినీటి సౌకర్యం, వైద్య సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ ఉంటుందనే విషయాన్ని గ్రహించాలన్నారు.

ఈ నెల 31వరకు ఎల్ ఆర్ఎస్‌కు దరఖాస్తులు

ఎల్ఆర్ఎస్ పథకంపట్ల అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో

కేశంపేట, మార్చి 3: అనధికార ప్లాట్లు, అక్రమ లేఅవుట్‌ల క్రమబద్ధీకరణకోసం ఈ నెల 31వరకు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని కేశంపేట ఎంపీడీవో రవిచంద్రకుమార్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వ ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు సోమవారం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఆయా శాఖల అధికారులతో సోమవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. ప్రభుత్వం ఎల్ఆర్ఎస్-2020 పథకం అమలు చేస్తున్నదన్నారు. ఈ నెల 31లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నవారికి ఫీజులో 25 శాతం రాయితీ ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని అక్రమ ప్లాట్ల వినియోగదారులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకునేలా కార్యదర్శులు కృషి చేయాలన్నారు. మరిన్ని వివరాలకు 8125209849ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో కిష్టయ్య, ఆర్ఐ నివేదిత, ఆయా గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్ రాయితీని సద్వినియోగం చేసుకోండి

ఆమనగల్లు : ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుదారులు ప్రభుత్వం ప్రకటించిన ఎల్ఆర్ఎస్ రాయితీని సద్వినియోగం చేసుకోవాలని ఆమనగల్లు మున్సిపల్ కమిషనర్ శంకర్‌నాయక్ సోమవారం తెలిపారు. 25 శాతం రాయితీతో డబ్బులు చెల్లించి అనధికారిక లే అవుట్లలోని తమ ప్లాట్లను రెగ్యులరైజ్ చేసుకోవాలన్నారు.

ఇద్దరు గంజాయి పెడ్లర్ల అరెస్ట్

9 కిలోల గంజాయి, రెండు కార్లు స్వాధీనం

చేవెళ్ల రూరల్, మార్చి 3 : చేవెళ్ల పోలీసులు ఇద్దరు గంజాయి పెడ్లర్లను అరెస్ట్ చేశారు. సీఐ భూపాల్ (శ్రీధర్, డీఐ ఉపేందర్ కథనం ప్రకారం.. ఆదివారం సాయంత్రం 5 గంటల సమయంలో చేవెళ్ల ఎస్సై శిరీష పెట్రోలింగ్ టీమ్‌తో మండలంలోని ముడిమ్యాల నుంచి చేవెళ్ల వైపు వెళ్తున్నారు. కేసారం గ్రామ శివారులోని బైపాస్ రోడ్డు వద్ద వేగనార్ కారు, హోండా యాక్టివా కారుతో పాటు నలుగురు అనుమానాస్పదంగా కనిపించారు. పోలీసులను చూసిన వెంటనే కారులో పారిపోయేందుకు ప్రయత్నించారు. కానీ, పోలీసులు అప్పటికే ఇద్దరు నిందితులను పట్టుకున్నారు. మిగతా ఇద్దరు పారిపోయారు. పట్టుబడ్డ వారిని తనిఖీ చేయగా.. వాహనాల్లో దాచిపెట్టిన బ్యాగ్‌లలో 9 కిలోల గంజాయి దొరికింది. దీంతో క్లూస్ టీమ్, మధ్యవర్తుల సమక్షంలో గంజాయితో పాటు రెండు కార్లు, రెండు సెల్ ఫోన్లు, తూకం మిషన్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రాత్రి 10 గంటల సమయంలో అరెస్ట్ చేసి ఎన్‌డీపీఎస్ చట్టం (నార్కోటిక్ డ్రగ్స్, సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్) కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

నిందితుల్లో ఒకరు చేవెళ్లలో నివాసముంటున్న ఏపీలోని రాజమండ్రికి చెందిన గోబేరు వెంకట చైతన్య అలియాస్ షేక్ రిజ్వాన్ కాగా, మరో వ్యక్తిని ఉప్పల్‌లో నివాసం ఉంటూ క్యాబ్ డ్రైవర్‌గా పని చేస్తున్న సూర్యాపేటకు చెందిన కూరెళ్ల సాయి అరుణ్‌గా గుర్తించారు. ఇందులో గోబేరు వెంకట చైతన్యపై 2023లో మేడ్చల్ పీఎస్ పరిధిలో, కూరెళ్ల సాయి కిరణ్‌పై 2021లోనే మొయినాబాద్ పీఎస్‌లో ఎన్‌డీపీఎస్ చట్టం కింద నమోదైంది. వీళ్లు మియాపూర్‌కు చెందిన శ్రీకాంత్ యాదవ్, విశాఖపట్నంలోని అరకుకు చెందిన సేన నుంచి గంజాయి తీసుకొని అమ్ముతున్నట్లు విచారణలో ఒప్పుకొన్నారు. నిందితులిద్దరిని సోమవారం కోర్టులో హాజరుపరిచామని, పరారీలో ఉన్న నాగోల్‌లో నివాసం ఉండే సూర్యాపేటకు చెందిన గణేశ్, షేక్ అబ్బాస్‌ను త్వరలోనే పట్టుకుంటామని సీఐ వెల్లడించారు.

రైతుల ప్రయోజనాలే ముఖ్యం

మామిడి సీజన్‌పై సన్నాహక సమావేశంలో గడ్డిఅన్నారం వ్యవసాయ పండ్ల మార్కెట్ కమిటీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి

సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ మధుసూదన్‌రెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 3 : మామిడి సీజన్‌లో రైతులకు ఎలాంటి సమస్యలు లేకుండా చూస్తామని గడ్డిఅన్నారం వ్యవసాయ పండ్ల మార్కెట్ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి అన్నారు. బాటసింగారంలోని గడ్డిఅన్నారం వ్యవసాయ పండ్ల మార్కెట్‌లో మామిడి సీజన్‌పై అన్ని శాఖల అధికారులు, పాలకవర్గం, సిబ్బందితో కలిసి మంగళవారం సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలోనే అతిపెద్ద మామిడి దిగుమతులు, ఎగుమతులు బాటసింగారంలోని గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్‌లోనే జరుగుతాయన్నారు. మార్కెట్‌లో రైతులకు ఎలాంటి సమస్యలు లేకుండా చూస్తామని తెలిపారు. రైతులు, వ్యాపారులు, అధికారులతో కలిసి సమన్వయం చేసుకుంటామన్నారు. రైతులకు కావాల్సిన కనీస వసతులు కల్పించి విశ్రాంతి, వైద్యసేవలు, ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ వంటి విషయాల్లో తగిన జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా ముందస్తు తగిన జాగ్రత్త చర్యలు చేపడుతున్నామన్నారు. మార్కెట్ కమిటీ పాలకవర్గం ఓ కుటుంబంలా ఉంటూ సమస్యలు ఎక్కడున్నా దగ్గరుండి పరిష్కరిస్తామన్నారు. మార్కెట్‌లో అధిక కమీషన్లు వసూలు చేస్తే లైసెన్స్‌లు రద్దు చేస్తామన్నారు. కార్యక్రమంలో అబ్దుల్లాపూర్‌మెట్ సీఐ అంజిరెడ్డి, వనస్థలిపురం ట్రాఫిక్ సీఐ గట్టుమల్లు, ఫైర్‌స్టేషన్ సీఐ యాదగిరి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భాస్కర్‌చారి, మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి శ్రీనివాస్, పాలకవర్గ సభ్యులు, మార్కెట్ కమీషన్ ఏజెంట్లు, సిబ్బంది ఉన్నారు.

వన్య ప్రాణుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

సీజీఆర్ వ్యవస్థాపకురాలు లీలమ్మ

ఎర్త్ సెంటర్‌లో వన్య ప్రాణుల సంరక్షణ కోసం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న లీలమ్మ

కడ్తాల్, మార్చి 3 : వన్య ప్రాణుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవెల్యూషన్ వ్యవస్థాపకురాలు లీలమ్మ అన్నారు. సోమవారం మండల పరిధిలోని అన్మాస్‌పల్లి గ్రామంలో గల ఎర్త్ సెంటర్‌లో సీజీఆర్ ఆధ్వర్యంలో వన్య ప్రాణుల సంరక్షణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నేదునూర్ గ్రామ మోడల్ స్కూల్ విద్యార్థులకు వన్య ప్రాణుల సంరక్షణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో లీలమ్మ మాట్లాడుతూ.. వన్య ప్రాణుల ఆవాసాలకు ఎలాంటి నష్టం కలిగించకుండా మన జీవన విధానాన్ని కొనసాగించాలని పేర్కొన్నారు. పర్యావరణంతోపాటు పుడమి తల్లిని కాపాడటానికి విరివిగా మొక్కలు నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు. అనంతరం వన్య ప్రాణుల సంరక్షణ కోసం కోసం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు, సీజీఆర్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

బ్యాంకులను మోసం చేస్తున్న దళారులపై చర్యలు తీసుకోవాలి

తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న లోయపల్లి గ్రామస్తులు

మంచాల మార్చి 3 : నిరుపేదలకు ప్రభుత్వం ఇచ్చిన ఇండ్ల స్థలాలను కొందరు దళారులు ధరణి పేరుతో రిజిస్ట్రేషన్ చేసుకొని బ్యాంకుల్లో తాకట్టు పెట్టి రుణాలు పొందుతున్నారని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలంటూ సోమవారం మంచాల మండలం లోయపల్లి గ్రామానికి చెందిన నిరుపేదలు మంచాల తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండల పరిధిలోని లోయపల్లిలోని సర్వే నంబర్ 34, 35లలో ఐదు ఎకరాల భూమిని 1979-80లో ప్రభుత్వం నర్సింగ్‌రావు దగ్గర కొనుగోలు చేసిందని చెప్పారు. ఆ భూమిని 1985లో నిరుపేద కుటుంబాలకు చెందిన వారికి ఒక్కో గుంట చొప్పున ఇవ్వడం జరిగిందని చెప్పారు. అందులో 40 సంవత్సరాల నుంచి ఇండ్లు నిర్మించుకొని ఎన్నో కుటుంబాలు నివాసాలు ఉంటున్నాయని చెప్పారు. 2024లో ధరణిలో నర్సింగ్‌రావు పేరుపై ఆ భూమి వస్తుందని.. గ్రామానికి చెందిన కొంతమంది దళారులు నర్సింగ్‌రావు వద్ద రహస్యంగా 4 నుంచి 10 గుంటల చొప్పున కొనుగోలు చేశారు. ఆ భూమిని బ్యాంకుల్లో తనఖా పెట్టి రుణాలు తీసుకుంటున్నారని చెప్పారు. గతంలోనే ప్రభుత్వం నిరుపేదలకు గుంట చొప్పున ఇండ్ల కోసం ఇచ్చిన భూమిని కొందరు దళారులు, పట్టాదారులతో కుమ్మక్కై చేస్తున్న మోసాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో మాదిగ జేపీసీ చైర్మన్ భాస్కర్ పాల్గొన్నారు.

ఇంటి స్థలాలు ఇచ్చే వరకు పోరాటం ఆగదు

ఇబ్రహీంపట్నం, మార్చి 3 : రామోజీ ఫిలింసిటీలో పేదలకు కేటాయించిన ఇండ్ల స్థలాలు ఇచ్చేంతవరకు పోరాటం ఆగదని సీపీఎం జిల్లా నాయకుడు జగన్ అన్నారు. ఇబ్రహీంపట్నం మండలం ముకునూరు గ్రామంలో సోమవారం రామోజీ ఫిలింసిటీ ఇంటి స్థలాల పోరాట కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత 17 సంవత్సరాలుగా ఇంటి స్థలాల కోసం నిరంతరం పోరాటం చేస్తున్నామన్నారు. ఇంకా ప్రజల ఓపికను పరీక్షించాలనుకుంటే అధికారులకు, ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. 2007లో అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి 670 మంది పేదలకు ఇంటి స్థలాలను కేటాయించి ఇల్లు కట్టుకోవడానికి ప్రొసీడింగ్స్ కూడా ఇచ్చారని.. ఆయన మరణం తర్వాత ఇంటి పట్టాలను అధికారులు తిరిగి తీసుకున్నారన్నారు. ఇంటి స్థలాలను రామోజీ యాజమాన్యం కబ్జా చేసినా పట్టించుకోకుండా అధికారులు చోద్యం చూస్తున్నారని.. అధికారులు, ప్రభుత్వం రామోజీ యాజమాన్యానికి లొంగిపోయారన్నారు. చర్చల పేరుతో కాలయాపన చేస్తే సహించేది లేదని, వెంటనే లబ్ధిదారులకు కేటాయించిన స్థలాలను ఇచ్చి ఇంటి నిర్మాణం కోసం ఐదులక్షల రూపాయలు ఇవ్వాలన్నారు. లేకపోతే త్వరలోనే లబ్ధిదారులకు ఇచ్చిన ఇంటి స్థలాలను సీపీఎం నాయకత్వంలో స్వాధీనం చేసుకుంటామని హెచ్చరించారు. అనంతరం పది మంది సభ్యులతో కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా కృష్ణ, సువర్ణ, సంతోష, సత్యమ్మ, పద్మ, యాదమ్మ, ఇందిరమ్మ, హబీబా, స్వరూప, ఆండాళు ఉన్నారు.

బైక్‌ను ఢీకొన్న బొలేరో

కేశంపేట, మార్చి 3 : బైక్‌ను బొలేరో వాహనం ఢీకొన్న ఘటనలో కేశంపేట పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ నరహరి కథనం ప్రకారం.. అల్వాల గ్రామ పంచాయతీలోని తులవానిగడ్డకు చెందిన జువ్వ రంగయ్య తన కుమారుడు ఉజ్వల్‌తో కలిసి ఎక్లాస్‌ఖాన్‌పేటకు కటింగ్ చేయించుకునేందుకు ఈ నెల 2న వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో బైక్‌పై వస్తున్నారు. ఈ నేపథ్యంలోనే బీఎస్ఆర్ గార్డెన్ వద్దకు రాగానే వేగంగా వచ్చిన బొలేరో వాహనం ఢీకొందన్నారు. ఈ ప్రమాదంలో రంగయ్య, ఉజ్వల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఇది గుర్తించిన స్థానికులు 108కి సమాచారం ఇవ్వడంతో క్షతగాత్రులను శంషాబాద్‌లోని లిమ్స్ ఆస్పత్రికి తరలించారన్నారు. రంగయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

గ్రామాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

షాబాద్, మార్చి 3 : ప్రభుత్వ నిధులతో గ్రామాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దుతామని షాబాద్ మాజీ సర్పంచ్ తమ్మలి సుబ్రమణ్యేశ్వరి అన్నారు. సోమవారం షాబాద్‌లో ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు రూ.25లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామంలో ఉన్న సమస్యల పరిష్కరానికి చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. అన్ని కాలనీల్లో సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీల నిర్మాణానికి కృషి చేస్తున్నామని స్పష్టం చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

మంచాల, మార్చి 3 : కారు అదుపుతప్పి ఎదురుగా వస్తున్న బైకును ఢీకొట్టడంతో భర్త అక్కడికక్కడే చనిపోగా భార్య, కూతురుకు తీవ్ర గాయాలైన సంఘటన మంచాల పోలీస్టేషన్ పరిధిలోని ఆగపల్లి సాగర్ రహదారిపై సోమవారం మధ్యాహ్నం జరిగింది. మంచాల సీఐ మధు కథనం ప్రకారం.. నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం యరుగండ్లపల్లి గ్రామానికి చెందిన మైలారం జంగయ్య(27) అతడి భార్య పార్వతమ్మ, కూతురు అశ్విని బైక్‌పై హైదరాబాద్‌కు శుభకార్యానికి వెళుతుండగా ఇబ్రహీంపట్నం నుంచి మాల్ వైపునకు వెళుతున్న కారు ఎదురుగా వస్తున్న బైకును ఆగపల్లి సమీపంలో ఢీకొన్నది. దీంతో జంగయ్య అక్కడికక్కడే మృతిచెందగా తీవ్ర గాయాలైన భార్య, కూతురును చికిత్స నిమిత్తం 108లో.. పోస్టుమార్టం నిమిత్తం జంగయ్య మృతదేహాన్ని ఇబ్రహీంపట్నం ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసి ఫిర్యాదు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కొందుర్గు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2001లో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు సోమవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకొని తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం తమ గురువులను సత్కరించారు. - కొందుర్గు, మార్చి 3

పదిలో 10 జీపీఏ సాధించాలి

కేశంపేట, మార్చి 3 : ఏడాదిపాటు కష్టపడి చదివిన విద్యార్థులు రాబోయే పదవ తరగతి వార్షిక పరీక్షల్లో 10 జీపీఏ సాధించాలని కేశంపేట మాజీ జడ్పీటీసీ తాండ్ర విశాల అన్నారు. కేశంపేట మండలం పాటిగడ్డ సమీపంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో 10వ తరగతి విద్యార్థులకు సోమవారం పరీక్ష ప్యాడ్లను అందజేశారు. అనంతరం మండలంలోని అన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లను జడ్పీటీసీ సొంత ఖర్చులతో అందజేశారు.

ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించండి

మంచాల, మార్చి 3 : మండలంలోని లోయపల్లి గ్రామంలో నిరుపయోగంగా ఉన్న ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాన్ని వెంటనే ప్రారంభించాలంటూ సీపీఎం మండల కార్యవర్గ సభ్యుడు సిలివేరు రాజు సోమవారం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మేజర్ గ్రామ పంచాయతీ అయిన లోయపల్లిలో గత ప్రభుత్వం ఆరోగ్య ఉపకేంద్రానికి నిధులు కేటాయించి భవనం నిర్మించినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ప్రారంభించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని చెప